క్లుప్తంగా

జీబీసీకి తాగునీరు విడుదల



షట్టర్లు ఎత్తుతున్న అధికారులు

విడపనకల్లు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు బ్రాంచి కెనాల్(జీబీసీ)కి ముందస్తుగా తాగునీరును విడుదల చేయాలని జీబీసీ అధికారులను కోరారు. దీంతో హెచ్చెల్సీ జీరో కిలోమీటర్ వద్ద జీబీసీ అధికారులు శనివారం తాగునీటి కోసం వంద క్యూసెక్కుల నీరురు విడుదల చేశారు. విడపనకల్లు సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి తాగునీటి పంపింగ్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రారంభించారు.

గ్యాస్ లీకై ఎగిసిపడ్డ మంటలు

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురం కొట్టాల గ్రామంలో శనివారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన మూడ్ సాలమ్మబాయి అనే మహిళకు చెందిన ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి వస్తువులన్నీ కాలిపోయాయి. ఇల్లు కూడా దెబ్బ తింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్యాస్ లీకై మంటలు ఎగిసిపడటంతో గ్రామస్తులు ఉరవకొండ ఫైర్ కార్యాలయానికి ఫోన్ చేయగా వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. పోలీసులు ఘటనా స్థలాన్నిపరిశీలించారు.

యువతి మృతి



మృతిచెందిన లలిత

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన హరిజన లలిత(17) అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, రుద్రమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కూలి పనులు చేసుకుని జీవనం చేసేవారు. లలితమ్మ సంవత్సరం నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. వైద్యుల వద్ద చూపించినా నయం కాక పోవడంతో.. మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు ఆమెను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లలిత మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం: రాయదుర్గం పట్టణంలో శనివారం ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధన్, మాజీ జిల్లా సహాయ కార్యదర్శి కొట్రేష్ హాజరై జెండా ఆవిష్కరించారు. అలాగే కళ్యాణదుర్గంలోని ఎస్టీ గురుకుల హాస్టల్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ఘనంగా పానకాల ఉత్సవం



చక్కెర చదివిస్తున్న ముజావర్ నిషార్

కూడేరు: చిన్న మొహర్రం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో పానకాల మహోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పక్కీర్లయిన వారు మరువలో మంగళ వాయిద్యాల నడుమ పానకాన్ని పీర్ల మసీదు వద్దకు తీసుకు వెళ్లి గుండం చుట్టు ప్రదక్షణలు చేపట్టారు. తర్వాత పీర్ల దేవుళ్లకు చక్కెర చదివించారు. ముజావర్ నిషార్ పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లిలో చిన్న పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. శనివారం పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్లను అలంకరించి కొలువు దీర్చారు. భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

పరామర్శ



మృతుడి సోదరుడు హరిని పరామర్శిస్తున్న జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి చెందిన తంబ్రీ కొడుకు రామమూర్తి, సాయికుమార్ వ్యాపారంలో నష్టాల కారణంగా జూలై 23న ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులు, సోదరుడు హరిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రామేశ్వరరెడ్డి, నాయకులు పాతన్న, మచ్చన్న, పురుషోత్తంరాజు, రాధాకృష్ణారెడ్డి, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను నమ్మి మోసపోవద్దు

• ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కణేకల్లు: నల్లంపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం రూరల్: విప్ కాపు రామచంద్రారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానించిన పల్లేపల్లి గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: ప్రభుత్వ పథకాలను అందించాలంటే ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి జన్మభూమి కమిటీల ద్వారా వసూళ్లకు పాల్పడిన టీడీపీ దోపిడీ దొంగలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని పల్లేపల్లిలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ నాగరాజరెడ్డి, గౌని శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజుతో కలిసి ఆయన శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాల ద్వారా లబ్ధి పొందిన బ్రోచర్లను ఇంటింటికీ వెళ్లి ఆయన లబ్దిదారులకు అందజేశారు. విప్ మాట్లాడుతూ గత ఐదేళ్ల టీడీపీ పాలనలో చంద్రబాబు, ఆయన అనుచరగణం చేయని దోపిడీ, దౌర్జన్యం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన మోసగాడు చంద్రబాబు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి, 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట మండల మాజీ కన్వీనర్ గొల్లపల్లి లక్ష్మీకాంతారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గొల్ల చిక్కణ్ణ, ఈరన్న, రామకృష్ణ, రుద్రప్ప, చౌడేష్, స్టోర్ డీలర్ సోమశేఖర్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ వెంకటరమేష్, పంచాయతీ కార్యదర్శి హేమంతరాజు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

కణేకల్లు: 'గడగ గడపకూ' సంక్షేమ పథకాలందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు మండలంలోని నల్లంపల్లి లో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాధారెడ్డి, హనుమంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుదర్శనరెడ్డితో కలిసి విప్ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేశారు. విప్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచారని, ఇది చూసి ఓర్వలేని టీడీపీ అధినేత చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజల సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని కాపు ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు రాష్ట్రానికి ఏమీ చేయకపోగా... మంత్రిగా ఉన్న మురికి కాలవ రాయదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ప్రజాధనాన్ని దోచుకుని అన్నివర్గాల వారిని వంచించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, జిల్లా బోర్డు డైరెక్టర్ మాబుపీరా, పులచెర్ల సర్పంచ బోయ రవి, గోపులాపురం సర్పంచ్ ప్రకాష్ చౌదరి, స్థానిక నాయకులు చంద్రారెడ్డి, పర్వత్ రెడ్డి, బోయ నాగరాజు, రవిచంద్ర, రవిప్రకాష్ రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, హనుమంతరావు, మక్బుల్, ఖలేదర్, సాదత్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

కణేకల్లు మండలంలోని ఆదిగానిపల్లికి చెందిన టీడీపీ నాయకులు లాలుస్వామి, గంగాధర్, లాలెప్ప, రామాంజి, దుర్గన్న వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం నల్లపల్లి గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదిగానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రచ్చుమర్రి నేతృత్వంలో వీరు పార్టీలో చేరారు. విప్ కాపు రామచంద్రారెడఇ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మణికంఠ, ఎర్రిస్వామి, గంగన్న, లాలుస్వామి పాల్గొన్నారు.

'గడప గడప'లో బ్రహ్మరథం పట్టారు

రాయదుర్గం రూరల్: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పల్లేపల్లి సచివాలయంతో మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో అందుతున్న సుపరిపాలనను ప్రజలే కొనియాడడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ద్వారా సచివాలయానికి అందే రూ.20 లక్షలతో తక్షణ అవసరాలను పరిష్కరిస్తున్నామన్నారు. నీచ రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలకు అలవాటు పడిన పచ్చపార్టీ నాయకుడు కాలవ శ్రీనివాసులు అల్లర్లు చేయడానికి రెచ్చగొట్టాడన్నారు. పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుని నాపై రకరకాల వ్యతిరేక వార్తలు రాయించారన్నారు. ఎక్కడా కాని నాతో పాటు మా నాయకులు, అధికారులు పట్టించుకోకుండా , చెక్కు చెదరని విశ్వాసంతో ముందుకు సాగామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రెవెన్యూ, మండల పరిషత్ , విద్య, వైద్యం, వ్యవసాయ, పంచాయతీ రాజ్, విద్యుత్ , అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ గౌని నాగరాజరెడ్డి, సీనియర్ నాయకులు గౌని శంకర్ రెడ్డి, గౌని లక్ష్మీకాంత రెడ్డి, గౌని సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో వైస్ ఎంపీపీ మృతి



నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, (ఇన్‌సెట్లో) సోమనాథ్ (ఫైల్)

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ బీజీ సోమనాథ్(బీజప్ప)శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ తిరుపతిలోని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేసుకుని, ఎనుములదొడ్డికి వచ్చి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజప్ప లాంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఎనుములదొడ్డిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి ప్రతిపక్ష పార్టీ లేకుండా కృషిచేశారన్నారు. మంత్రితో పాటు జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, సర్పంచ్ విజయ్‌కుమార్ నాయకులు బొమ్మలింగ,అతావుల్లా, రామమూర్తి తదితరులు నివాళులర్పించారు. కాగా బీజప్పకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు కృషి



ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఈఆర్‌ఓ శంకరయ్య

ఉరవకొండ: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లోగా తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు కావడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీఎల్‌ఓలకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శంకరయ్య సూచించారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని కామన్నకట్ట, గాంధీచౌక్, పాతపేట తదితర బూత్‌ల పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ఏఈఆర్‌ఓ హరిప్రసాద్, ఈడీటీ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణలతో కలసి ఆయన పర్యవేక్షించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడానికి బీఎల్‌ఓలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు.

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి

బ్రహ్మసముద్రం: ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ బాలకిషన్ ఆదేశించారు. శనివారం మండలంలోని వెస్ట్ కోడిపల్లి, కన్నేపల్లి పంచాయతీల్లో ఇంటింట సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటు నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగిరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం



శివశంకర శివచార్య మహాస్వామీజీని సత్కరిస్తున్న కుర్ణి కులస్తులు

ఉరవకొండ: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ఐక్యంగా సమస్యల సాధన కోసం కుర్ణి కులస్తులు ముందుకు సాగాలని నీలకంఠేశ్వర రుద్ర వంశ పరంపరాగత కుర్ణి కులగురువు హుబ్లీకి చెందిన శివశంకర శివచార్య మహాస్వామిజీ సందేశమిచ్చారు. శనివారం స్థానిక మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం కల్యాణ మండపంలో నియోజకవర్గ కుర్ణి కులస్తుల సమావేశం, కులగురువుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. కుర్ణి సంఘం నాయకుడుఏ ఎస్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో కుర్ణి కులస్తులు కులగురువును ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం కులగురువు కుర్ణి కులస్తుల అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. అలాగే ఉరవకొండలో కుర్ణి ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుర్ణి సంఘం నాయకులు గడిగే సూర్యనారాయణ, కె.కె.బాబు, కె.శేఖర్, బుట్టాతిప్పయ్య, కామార్తి ఎర్రిస్వామి, బండయ్య, తొడగట్టి శేఖర్, మిట్ట ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ప్రజావేదిక



మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్‌రెడ్డి

శెట్టూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా సాగింది. మండలంలో 2022–23లో జరిగిన ఉపాధి పనులకు 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మొత్తం రూ. 11,12,49,500 పనులు జరిగాయి. అందులో వేతన రూపంలో రూ. 7,47,44,984 మెటీరియల్ రూపంలో 3,65,04,516 ఖర్చు చేశారు. వారం రోజుల నుంచి గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి సామాజిక తనిఖీ బృంద సభ్యులు పనులను పరిశీలించారు. శనివారం పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణా రెడ్డి, ఎస్టీఎం గౌరీశంకర్ సమక్షంలో ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో రూ.1,49,300ను రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న యాదవ్, మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, సచివాలయ కన్వీనర్ తిమ్మరాజు, నాయకులు హరినాథ రెడ్డి, ముత్యాలు, ఏపీడీ రమేష్ నాయక్, ఏపీఓ రమేష్, ఈఓఆర్డీ రఘురామరావు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్రైస్తవుల శాంతి ర్యాలీ

కళ్యాణదుర్గం: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు ఆగిపోయి..ఆ రాష్ట్రంలో శాంతి నెలకొలకొనాలని కోరుతూ శనివారం కళ్యాణదుర్గం పట్టణంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు డీఎన్ పాల్, ఐజయ్య, జాన్సన్‌బాబు, బసవరాజు, ప్రసాద్‌రావు, చల్లా కిషోర్, చర్చ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణాష్టమి వేడుకలకు అనుమతివ్వండి'

కళ్యాణదుర్గం: సెప్టెంబర్ 6,7 తేదీల్లో నిర్వహించే కృష్ణ జన్మాష్టమి వేడుకలకు అనుమతి ఇవ్వాలని త్రైత సిద్దాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులును కలసి విన్నవించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం సభ్యులు మేఘరాజు, రామ్మోహన్‌రెడ్డి, సాయి, గణేష్, ఆది, అంజలి, త్రివేణి తదితరులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలోని స్థానిక కోటవీధిలో తేరు దగ్గర వేడుకలు జరుపుకుంటామని, ముందస్తు అనుమతి తీసుకున్నారు.

పశువులకు టీకా

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో పశువులకు బొబ్బులు వ్యాధి(లంపీ స్కిన్ డిసీజ్) సోకకుండా నివారించేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎంపీపీ నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఆవులు, ఎద్దులకు డాక్టర్ శ్వేత వ్యాక్సిన్ వేశారు గోపాల మిత్ర ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు

గొర్రెలు అడ్డొచ్చి బైకు బోల్తా

కళ్యాణదుర్గం: మండలంలోని మల్లికార్జునపల్లి వద్ద గొర్రెలు అడ్డువచ్చి ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మల్లిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గుండ్లపల్లి వైపు నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. మల్లికార్జునపల్లి వద్దకు రాగానే రోడ్డుపైకి వచ్చిన గొర్రెలను తప్పించబోయి వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఘటనలో శ్రీనివాసులుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

గొర్రెల అపహరణ

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండలో శుక్రవారం రాత్రి కుమ్మర నరసింహులుకు చెందిన ఐదు గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శనివారం బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.80 వేలు నష్టపోయానని బాధితుడు వాపోయాడు.

వివాహిత ఆత్మహత్య

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురం గ్రామానికి చెందిన వివాహిత స్వాతి(20) శనివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు కూలీ వీరేష్ భార్య స్వాతి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడేది. నొప్పి తీవ్రంగా మారడంతో జీవితం విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి స్వాతిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం సచివాలయంలో పశు సంవర్ధక శాఖ సహాయకుడిగా పనిచేస్తున్న పి.శ్రీనాథ్ ఆత్మహత్యాయత్నం చేశాడు. శనివారం కొనకొండ్ల గ్రామంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లిన ఆయన అక్కడ పశువులకు వాడే మందును తాడి, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే కొనకొండ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు తొలుత గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రైతులను మభ్యపెట్టింది టీడీపీనే..



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: గత టీడీపీ ప్రభుత్వంలో హంద్రీ నీవా 36వ ప్యాకేజీ పనుల్లో భూసేకరణలో రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండా మభ్య పెట్టి కాలువలు తవ్వి టీడీపీ కాంట్రాక్టర్లు లాభపడ్డారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి రెండు రోజుల క్రితం మండలంలోని కోనాపురం, గంగవరం, హనిమరెడ్డిపల్లి చెరువులకు బీటీపీ కాలువ నుంచి నీటిని అందించే రూట్ మ్యాప్‌ను హంద్రీనీవా అధికారుల బృందంతో క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులకు నిజాలను వివరించారు. దీంతో టీడీపీ నాయకులు తమ ఉనికి ఎక్కడ కోల్పోతామోనని మాజీ ఎమ్మెల్యేను విలేకరుల సమావేశంలో విమర్శించారు. టీడీపీ విమర్శలను ఖండిస్తూ శనివారం బొమ్మనహాళ్ సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప నివాసంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి అశోక్, మండల బూత్ కమిటీ కన్వీనర్ మచ్చన్న, సర్పంచ్ రమేష్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువతో జీడిపల్లికి వచ్చిన నీటిని, శీర్పి, బొమ్మనహాళ్ చెరువులకు టీడీపీ నాయకులు తెచ్చామనడం సిగ్గుచేటన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీటీపీకి రూ.208 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు.బీటీ ప్రాజెక్టు కాలువ పరిధిలోనే గెజిట్‌లోకి హనిమరెడ్డిపల్లి, గంగవరం, కోనాపురం చేరిందని గుర్తుచేశారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి గ్రామాల్లో హారతులతో స్వాగతిస్తున్నారన్నారు. కానీ టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేవలం పత్రికా ప్రసంగాలతో ప్రభుత్వాన్ని విమర్శించే పనిలో తప్ప ప్రజా సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. టీడీపీ దొంగ ఓట్ల తొలగింపులో ఉలిక్కి పడిందన్నారు. దొంగ ఓట్ల తొలగింపు విషయంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. అభివృద్ధికి సంబంధించి ఎక్కడైనా సరే తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు తిమ్మారెడ్డి, గోపాల్, పురుషోత్తంరాజు, రాధాకృష్ణారెడ్డి, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి, బాబు, దాసు, బాబునాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: వేర్వేరు చోట్ల ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటనలు శనివారం చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బోరంపల్లికి చెందిన వడ్డే రత్నమ్మ కుటుంబ కలహాలతో శనివారం ఉదయం పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను భర్త రామాంజనేయులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అలాగే పాపంపల్లికి చెందిన అనిల్ వ్యక్తిగత కారణాలతో పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. కాగా ఈ రెండు సంఘటనలపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ తిప్పయ్య

విడపనకల్లు: ఎస్ఐగా తిప్పయ్య శనివారం బాధ్యతలు చేప ట్టారు.ఎస్ఐకి సిబ్బంది సాదారంగా స్వాగతం పలికారు. అంతక ముందు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని ఎస్ఐ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

ఘనంగా హజరత్ పీరాషావలీ ఉరుసు



దర్గాలో ఫాతేహాలు చేయిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో ప్రసిద్ధి చెందిన హజరత్ పీరాషావలీ ఉరుసు సందర్భంగా శనివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి దర్గాను సందర్శించి ప్రత్యేకంగా ఫాతేహాలు చేయించారు. ముందుగా ఆలయ ధర్మకర్త పూల రంగన్న, కమిటీ నిర్వాహకులు విప్ దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని విప్ ఆకాంక్షించారు. అనంతరం దర్గా కమిటీ నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేశ్వవరెడ్డి, జిల్లా బోర్డు డైరెక్టర్ మాబుపీరా, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు కెనిగుంట రామిరెడ్డి, గౌని శ్రీనివాస్‌రెడ్డి, పాటిల్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంత్రకాయల వన్నూరప్ప, ఇల్లూరి శ్రీనివాసులు, బోర్‌వెల్ నాగిరెడ్డి, డిష్ గోవిందు, బషీర్, మంజు, సాదత్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి రోడ్డు సమస్యకు పరిష్కారం



జోడు లింగాల ఆలయానికి వేసిన సిమెంట్ రోడ్డు

కూడేరు: దక్షిణ భారతదేశంలోని ప్రఖ్యాతిగాంచిన శైవ క్షేత్రాల్లో శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం ప్రధానమైంది. ఈ ఆలయానికి జిల్లానే కాదు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలి వస్తుంటారు. అనంతపురం-బళ్లారి ప్రధాన ర హదారి నుంచి సాయిబాబా ఆలయం వద్ద నుంచి జోడు లింగాల ఆలయానికి ఉన్న రోడ్డు మార్గం దెబ్బతిని కొన్నేళ్లుగా అధ్వానంగా మారింది. భక్తులు ఈ రోడ్డు మార్గం మీదుగా వెళ్లాలంటే ఇబ్బంది పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుకు మోక్షం లభించింది. ఎంపీపీ నారాయణరెడ్డి సమస్యను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి మండల పరిషత్ గ్రాంట్ కింద సుమారు రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేశారు. కొన్నేళ్లుగా నెలకొన్న రోడ్డు సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.